క్లుప్తంగా

విజ్ఞాన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ హిమబిందుకు పీహెచ్‌డీ



చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కటికల హిమబిందుకు పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసినట్లు వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ సోమవారం తెలిపారు. ''డిజైన్ ఆఫ్ సీమ్‌స్ ఎపీరెటీనల్ విజన్ రీస్టోరేషన్ సిస్టమ్'' అనే అంశంపై ఆమె పరిశోధన చేశారని వివరించారు. ఈమె తన పరిశోధనలో భాగంగా 1 ఎస్‌సీఐ, 3 స్కోపస్ పేపర్లు, 1 జర్మన్ పేటెంట్ పబ్లిష్ చేశారని వెల్లడించారు. పీహెచ్‌డీ పట్టా పొందిన హిమబిందును పలువురు అభినందించారు.

దేవుడు చూపిన మార్గంలో నడవాలి

రేటూరు(కాకుమాను): ప్రతి ఒక్కరూ ప్రభువైన ఏసు క్రీస్తు చూపిన మార్గంలో నడవాలని తండ్రి సనిధి మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బ్రదర్ షాలేంరాజు అన్నారు. మండలంలోని రేటూరులో సోమవారం గ్రామస్తుల సహాయ సహకారాలతో నూతనంగా నిర్మించిన తండ్రి సన్నిధి మందిరాన్ని బ్రదర్ షాలేంరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో పాస్టర్ జెకర్యా పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్ జేసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్ అందించటమే లక్ష్యమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని తెలిపారు. సోమవారం చౌడవరంలోని కళాశాలలో ఎడ్యుతంత్ర్ కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఎంపికల్లో కళాశాలకు చెందిన 42 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలకు అర్హత సాధించిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్స్ సిహెచ్.శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్‌బాబు అభినందించారు.

మజ్జిగ ప్యాకెట్‌లు పంపిణీ

కాకుమాను: మండలంలోని కాకుమాను, చినలింగాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు సోమవారం ఉప్పుటూరి చిన రాములు సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు కె.ఎఫ్.కెనడీ, కె.విజయ్ భాస్కర్, హెచ్‌ఎం బి.సత్యం, జవహర్ రాణి పాల్గొన్నారు.

పరీక్షలు పరిశీలన

పది పరీక్షల తీరును ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ, తహసీల్దార్ బి.వెంకటస్వామి పరిశీలించారు.

హోప్‌విన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



గుంటూరు మెడికల్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షల చేస్తున్న ముస్లింలకు స్థానిక గుంటూరు వారితోట 7వ లైన్‌లో ఉన్న హోప్ విన్ హాస్పిటల్స్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. వ్యవస్థాపకులు, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్, చైర్మన్, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో గ్రామీణ వైద్యులు, హోప్ విన్ హాస్పిటల్స్ వైద్యులు, గుంటూరు నగరానికి చెందిన వైద్యులు, రంజాన్ ఉపవాస దీక్షాపరులు, హోప్ విన్ హాస్పిటల్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నజీరుద్దీన్, డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ పేదలకు సేవ చేయాలనే మంచి లక్ష్యంతో తమ హాస్పటల్ ఏర్పాటు చేశామన్నారు. రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకొని ప్రతి ఒక్కరికి మంచి జరగాలని ఆకాంక్షించారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తోన్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. ప్రభాతసేవ, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, సహస్రనామార్చన నిత్య హోమం, మహా పూర్ణాహుతి, చూర్ణోత్సవం, చక్ర తీర్థ ఉత్సవం వంటి కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం వేళలో ధ్వజావరోహణ, దేవతో ద్వాసనం, శ్రీపుష్పయాగం, పూలంగిసేవ, పవళింపు సేవ భక్తి ప్రపత్తులతో చేపట్టారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ, కార్యదర్శులు పాతకోట బ్రాహ్మణయ్యనాయుడు, దాసరి భాస్కరరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు ప్రారంభం

ప్రత్తిపాడు/పొన్నూరు/పెదకాకాని: పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని స్థానిక భవనం వెంకటరెడ్డి పరిషత్ ఉన్నత పాఠశాల, శ్రీనివాస హైస్కూలు, చినకోండ్రుపాడు హైస్కూల్ సెంటర్లలో విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షలకు హాజరయ్యేందుకు వచ్చిన విద్యార్థులు సమయం దాటి పోవడంతో కంగారు పడుతూ కేంద్రాలకు పరిగెత్తాల్సి వచ్చింది. మరి కొందరు తమ వెంట తల్లిదండ్రులను, స్నేహితులను, బంధువులను వెంటపెట్టుకొని వచ్చారు.

పెదకాకాని మండలంలోని వెనిగండ్ల, పెదకాకాని, కొప్పురావూరు, నంబూరు, ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో మొత్తం 911 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 902 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు.



ఎగ్జామ్ టైం: పరీక్షలు రాసేందుకు వెళుతున్న విద్యార్థులు



హర్రీ టైం: చివరి నిమిషంలో పరీక్ష కేంద్రంలోనికి పరుగులు పెడుతూ



'టెన్' షన్ వద్దని: ఏడుస్తున్న కూతురికి ధైర్యం చెబుతూ పరీక్షకేంద్రానికి తీసుకువెళుతున్న తండ్రి

నా నంబరెక్కడుందబ్బా: హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు





పొన్నూరులో హాల్ టికెట్ నెంబరు చూసుకుంటున్న విద్యార్థులు



పెదకాకాని జిల్లా పరిషత్ పాఠశాల వద్ద పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

జీవీఆర్‌ఎస్‌లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం



వీధులను శుభ్రం చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

గుంటూరు రూరల్: పరిసరాల పరిశుభ్రత ద్వారా ప్రజా ఆరోగ్యాలను కాపాడుకోవచ్చని జీవీఆర్‌ఎస్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.కరిముస్నీసా తెలిపారు. సోమవారం కళాశాల విద్యార్థులు బుడంపాడు గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రజలకు ఇంటింటికి తిరిగి తడిచెత్త పొడిచెత్త వేరుచేసే పద్ధతిని వివరించారు. గ్రామంలోని వీధుల్లో తిరిగి వీధులను శుభ్రపరిచారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం లక్ష్యాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ భాస్కరనాయుడు, డీన్ డాక్టర్ జి.వరప్రసాద్, ఏఓ యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేర్ వెల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



భోజనం వడ్డిస్తున్న డాక్టర్ నాగూర్‌బాషా

గుంటూరు మెడికల్: రంజాన్ పండుగ సందర్భంగా ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, కేర్‌వెల్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ షేక్ నాగూర్ బాషా ఆధ్వర్యంలో స్థానిక పొన్నూరు రోడ్డు ముస్లిం కాలేజీలో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వివిధ రాజకీయ పార్టీ నాయకులు, గుంటూరుకు చెందిన ప్రముఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు పార్టీల నేతలు, సీనియర్ వైద్యులు మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లింలు అల్లాహ్ ఆశీస్సులు పొంది ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఉపవాస దీక్ష చేసే వారికి ఇఫ్తార్ విందు ఇవ్వడం వల్ల వారితో సమానంగా అల్లాహ్ నుంచి పుణ్యం లభిస్తుందని తెలిపారు. సుమారు 4500 మంది ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశామని గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ షేక్ నాగూర్‌బాషా తెలిపారు. హాస్పిటల్ ప్రారంభించిన దగ్గర నుంచి అనేక ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. వ్యాధులపై, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ సామాజిక సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేర్ వెల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్ బాషా, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

అక్రమంగా నిర్మిస్తున్న దుకాణం తొలగింపు



మనల్ని ఎవడ్రా ఆపేది...!

సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..



రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న దుకాణాన్ని తొలగించిన పట్టణ ప్రణాళిక అధికారులు

నెహ్రూ నగర్: కొత్తపేట క్లాత్ మార్కెట్ వద్ద రోడ్డును ఆక్రమించుకుని స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్ అండదండలతో దుకాణం నిర్మిస్తున్నా పట్టణ ప్రణాళిక అధికారులు పట్టించుకోకపోవడంపై సాక్షిలో సోమవారం మనల్ని ఎవడ్రా ఆపేది...! అనే శీర్షిక ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పట్టణ ప్రణాళిక అధికారులు సోమవారం ఉదయం నాటికి దుకాణాన్ని పూర్తిగా పడగొట్టేశారు. ముందే అక్రమ కట్టడాలు జరగకుండా చూసి ఉంటే ఇంత దూరం వచ్చేది కాదు కదా అని పలువురు అధికారుల తీరును ఎండగడుతున్నారు.

టీచర్ల సీనియారిటీ జాబితాలు విడుదల చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరుజిల్లాలో 1994 నుంచి 2018 వరకు నిర్వహించిన డీఎస్సీలకు సంబంధించిన అన్ని కేడర్ల వారీగా ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవ లింగారావు, మొహ్మద్ ఖాలీద్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుకను కలిసి సీనియార్టీ జాబితాపై వివిధ అంశాలను ఆమె దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. బదిలీలు, ఉద్యోగోన్నతులను వివాదాలకు తావు లేకుండా జరిపేందుకు నిబంధనలు మేరకు సీనియారిటీ జాబితాలను ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. 1994, 1996 డీఎస్సీల ద్వారా ఎంపికై, 2002 నవంబర్‌లో జరిగిన ఉద్యోగోన్నతుల్లో నష్టపోయిన స్కూల్ అసిస్టెంట్లు ఉద్యోగోన్నతి జాబితాను సవరించి 66 మంది స్కూల్స్ అసిస్టెంట్లకు నోషనల్ సీనియారిటీ జాబితా రూపొందించి న్యాయం చేయాలని కోరారు. అదే విధంగా 2009 డీఎస్సీ ద్వారా హామీపత్రాలతో ఉపాధ్యాయులుగా నియమితులైన వారికి పాఠశాలల్లో చేరిన తేదీని కామన్‌గా ఒకే తేదీని నిర్ణయించాలన్నారు.

ఐదు కార్లు దగ్ధం



పెదకాకాని: ప్రమాదవశాత్తూ కార్లు దగ్ధమైన ఘటన గుంటూరు ఆటోనగర్‌లో చోటు చేసుకుంది. గుంటూరు ఆటోనగర్‌లోని ఏపీఐఐసీ కార్యాలయం సమీపంలో పలు పాతకార్లు నిలిపారు. ఆకార్లకు నిప్పు అంటుకుని మంటలు చెలరేగాయి. అదే ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఉండటంతో మంటల్లో ఎక్కడ పేలుతుందోనని స్థానికులు ఆందోళనతో పరుగులు తీశారు. విద్యుత్‌శాఖ సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. స్థానికులు సమాచారంతో ఘటనా స్థలానికి పెదకాకాని పోలీసులు, అగ్నిమాపకశాఖ వాహనం చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ టీపీ నారాయణస్వామి తెలిపారు.

9న చలో విజయవాడ

గుంటూరు మెడికల్: ఏళ్ల తరబడి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు శ్రమదోపిడీకి గురవుతున్నారని, పనికి తగ్గ జీతభత్యాలు చెల్లించడం లేదని పారా మెడికల్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి.రమేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాజ్యాంగం యొక్క ప్రాథమిక హక్కులను ఉల్లంఘించి జీవో నంబర్ 2 ను విడుదల చేసిందన్నారు. అది సరైన పద్ధతి కాదని ఆప్కాస్‌లో పనిచేస్తున్న పారా మెడికల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీఓ నంబర్ 2 సవరించి మినిమం ఆఫ్ టైం స్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 19వ తేదీ చలో విజయవాడ ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

శనగ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



తహసీల్దార్ శంకర్ బాబుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతు సంఘ నాయకులు

పెదనందిపాడు(కాకుమాను): శనగ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రామారావు కోరారు. పెదనందిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రామారావు మాట్లాడుతూ పెదనందిపాడులోని మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి క్వింటాకు ఏడు వేల రూపాయల మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో క్వింటా రూ.7,150 చొప్పున రైతులకు 25 శాతం సబ్సిడీపై శనగలు పంపిణీ చేసిందని కానీ ఇప్పుడు మాత్రం కేవలం క్వింటా ధర రూ.5,650 మద్దతు ధర ప్రకటించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఏ ఒక్క పంటకు కనీస మద్దతు ధర లేకపోవడంతో రైతులు, కౌలు రైతులు అప్పులపాలు అవుతున్నారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ శంకర్ బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కొత్త వెంకట శివరావు, నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, జంపని రామారావు, నల్లమోతు రాజేంద్ర, దేవరకొండ శ్రీనివాసరావు, షేక్ షమీ, పసుపులేటి శేష గిరిరావు, లక్ష్మి, టి.గాబ్రియేల్ పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించాలి



బ్యాంకు పథకాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పొన్నూరు: బ్యాంకులలో తీసుకున్న రుణాలను ఖాతాదారులు సకాలంలో చెల్లించి సిబిల్ స్కోర్ పెంచుకోవాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ సూర్య ప్రకాష్ అన్నారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పరివర్తన భవనంలో సోమవారం భారతీయ రిజర్వ్ బ్యాంకు, సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్లు మణి భూషణం, సురేష్, సూర్య ప్రకాష్, వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు. మణిభూషణం మాట్లాడుతూ బ్యాంకులకు సంబంధించిన విషయాలను తెలియజేసేందుకు ఇలాంటి సదస్సులు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భవిష్యత్ అవసరాల మేరకు పొదుపు చేసుకోవాలని తెలిపారు. రిసోర్స్ పర్సన్ జానకిరామ్ మాట్లాడుతూ ఖాతాదారులందరూ కచ్చితంగా సామాజిక భద్రత పథకాలలో చేరాలని కోరారు. అనంతరం పొదుపు పథకాల కరపత్రికను ఆవిష్కరించారు. పొదుపు నగదు రహిత లావాదేవీల నిర్వహణపై కళాకారులు వీధి నాటిక ప్రదర్శించారు. కార్యక్రమంలో అవార్డు సంస్థ ప్రతినిధులు కె. జాషువా, ఆర్. మదన్, పి. పీటర్, నాగమణి పాల్గొన్నారు.

సెల్లార్ పార్కింగ్‌కు బదులు వ్యాపారం

పీజీఆర్‌ఎస్‌లో కమిషనర్‌కు ఫిర్యాదు

నెహ్రూనగర్: నగరంలోని లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులో ఓ షాపు యాజమాని అడ్డగోలుగా పార్కింగ్ ప్రదేశాన్ని ఆక్రమించి నూతనంగా షాపులు నిర్మాణం చేపట్టారని సోమవారం గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో పఠాన్ మొహమాలిఖాన్, రామకృష్ణ ఫిర్యాదు చేశారు. నిత్యం రద్దీగా ఉండే గుంటూరు లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులో ఆ షాపింగ్ కాంప్లెక్స్‌లో పార్కింగ్‌కు కేటాయించిన స్థలంలో వాహనాలు పెట్టనీయకుండా భవన యాజమాని నూతనంగా షాపుల నిర్మాణం చేపట్టారు. పార్కింగ్ ప్రదేశంలో ఈ షాపులను అడ్డగోలుగా అక్రమంగా ఏర్పాటు చేయడంతో పార్కింగ్ ప్రదేశం లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెల్లార్‌లో షాపులు నిర్మాణం చేపడుతున్నారని అనేక పర్యాయాలు ఫిర్యాదు చేయగా...టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి సెల్లార్లల్లో పార్కింగ్ కోసం కేటాయించిన ప్రదేశంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించి వాహనాల పార్కింగ్‌కు తిరిగి ఆ స్థలాన్ని అప్పగించాలని కోరారు.

ఆర్‌ఐపై ఫిర్యాదు..

నెహ్రూనగర్: పన్ను విభజన చేసేందుకు ముడుపులు సమర్పించినప్పటికీ పన్ను మారకపోవడంపై బాధితురాలు సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరుగుతున్న పీజీఆర్‌ఎస్‌లో కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. తారకరామనగర్‌కు చెందిన పాలెపోగు రమణ అదే ప్రాంతంలో 157 గజాల స్థలంలో వేరే వ్యక్తి వద్ద నుంచి పాలెపోగు రమణ 57 గజాలు రెండు సంవత్సరం క్రితం కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. సదరు స్థలానికి ఇంటి పన్ను ఉంది. ప్రస్తుతం కొన్న స్థలం వరకు పన్ను బైఫర్‌కేషన్(పన్ను విభజన) చేయాలని గతంలో ఇక్కడ ఆర్‌ఐగా పనిచేసిన ఉద్యోగి డబ్బులు డిమాండ్ చేయడంతో రూ.60 వేలు దాకా సమర్పించుకున్నారు. సంవత్సరాలు గడుస్తున్నా పన్ను మారకపోవడంతో పాటు గతంలో ఇక్కడ పనిచేసిన ఆర్ఐ బదిలీ అయ్యారని మాకు పన్ను విభజన చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వినియోగదారుల హక్కులపై వర్క్‌షాప్

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులపై అవగాహనతో పాటు సమస్యలు, కల్తీ వస్తువులు, ఆహార పదార్థాలపై వర్క్‌షాప్, ప్రదర్శన సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా పెంపుడు జంతువుల ఆహారం, డిజిటల్ ఆధారిత మోసాలు, బ్రాండెడ్, జనరిక్ మందులు, సైబర్ సెక్యూరిటీస్, దొంగనోట్లు, నిత్యావసర సరుకుల కల్తీ, వస్త్రాలు, బంగారు ఆభరణాల హాల్ మార్కింగ్, తూకంలో మోసాలు వంటి అంశాలపై ప్రదర్శన ఆకట్టుకుంది. కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ మాట్లాడుతూ నిత్యం మనం వినియోగించే వస్తువులు, సామగ్రి నాణ్యత, మోసాలపై ఇటువంటి ప్రదర్శలు, వర్క్‌షాప్‌ల ద్వారా వినియోగదారులను చైతన్యపరచవచ్చునని తెలిపారు. ఈసందర్భంగా ప్రదర్శనలో ఉత్తమ ప్రాజెక్టులను ప్రదర్శించిన విద్యార్థులను తొలి మూడుస్థానాల్లో విజేతలుగా ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.సాంబశివరావు, ఆంగ్ల శాఖాధిపతి పి.నాగసుశీల, ఐక్యూఏసీ సమన్వయకర్త టి.బాల నరేంద్రప్రసాద్, ఐ.హట్టి, చరణ్‌చౌదరి, కె.అంజనాదేవి, వెంకటకృష్ణ, కె.వీణ, కె.అరుణకుమారి, యు.వెంకటేశ్వరరావు, కె.కల్పన పాల్గొన్నారు.